## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కుత్బుల్లాపూర్, నవంబర్ 13: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన పి.మహేశ్(30) దీపావళి సందర్భంగా పటాకుల కోసం బోయిన్‌పల్లికి తన పల్సర్ బైక్‌పై వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మేడ్చల్ కండ్లకోయ వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ పల్స ర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్ రోడ్డుపై పడిపోయాడు. అతడి తల పైనుంచి లారీ టైర్ ఎక్కడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

## ప్రమాదవశాత్తు నిప్పంటుకుని..

### దంపతుల మృతి



రాఘవరావు, రాఘవమ్మ(ఫైల్)

మల్కాజిగిరి, నవంబర్ 13: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని దంపతులు మృతి చెందారు. ఈ ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. ప్రేమ్‌విజయనగర్ కాలనీ వెంకటేశ్వర అపార్టుమెంట్‌లో నివసిస్తున్న రాఘవరావు, రాఘవమ్మ దంపతులు. రాఘవరావు గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. బెడ్ పైనే ఉంటున్నాడు. రాఘవమ్మ ఆదివారం రాత్రి ఇంట్లో దీపం వెలిగిస్తుండగా.. ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. వెంటనే ఆమె కేకలు వేస్తూ బెడ్‌రూంలోకి వెళ్లి.. నిప్పును ఆర్పే ప్రయత్నంలో బెడ్‌పైన పడుకుంది. వెంటనే ఆ మంటలు బెడ్‌పై ఉన్న రాఘవరావుకు కూడా అంటుకున్నాయి. రాఘవమ్మ అరుస్తూ బయటకు రావడంతో స్థానికులు గమనించి.. మంటలను ఆర్పివేశారు. 108అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో వారు వచ్చి బెడ్‌రూంలో గాయాలపాలైన రాఘవరావును పరిశీలించగా.. అతడు అప్పటికే మరణించినట్లు గుర్తించారు. తీవ్రగాయాలైన రాఘవమ్మను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం రాఘవమ్మ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఉలిక్కి పడ్డ బజార్‌ఘాట్

- అగ్నిప్రమాదంతో స్థానికంగా విషాదఛాయలు
- గ్రౌండ్ ఫ్లోర్‌లో కెమికల్ డ్రమ్స్
- ప్రమాద కారణాలపై భిన్న వాదనలు

సిటీబ్యూరో/అబిడ్స్/సుల్తాన్‌బజార్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): నాంపల్లి బజార్‌ఘాట్‌లో సోమవారం ఉదయం జరిగిన భారీ అగ్ని ప్రమాదం ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకపక్క ఇండ్ల నుంచి ఆర్తనాదాలు.. మరోపక్క కెమికల్ డబ్బాలు పేలడంతో పెద్ద పెద్ద శబ్దాలు వచ్చాయి.. దీంతో ప్రమాదం జరిగిన భవనం చుట్టూ ఉన్న కుటుంబాలు భయంతో వణికిపోయాయి. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక, బల్దియా, సంబంధిత ఇతర శాఖలు వెంటనే స్పందించాయి. అప్పటికే ప్రమాదస్థాయి పెరిగిపోయి.. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిపోయింది.

ఆదివారం దీపావళి పండుగ కావడంతో చాలా మంది అర్ధరాత్రి దాటేవరకు ప్రజలు మేల్కొనే ఉన్నారు. విద్యా సంస్థలకు సెలవు కావడంతో సోమవారం ఆలస్యంగా నిద్రనుంచి మేల్కొన్నారు. కొంత మంది పిల్లలు సోమవారం ఉదయం తమ ఇండ్ల ముందు పటాకులు కాల్చారు.

ఈ క్రమంలోనే ఉదయం 9 గంటల సమయంలో బజార్‌ఘాట్‌లోని రమేశ్ కుమార్ జైస్వాల్‌కు చెందిన బాలాజీ అపార్టుమెంట్ సెల్లార్ (గ్రౌండ్) అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ భవనం నాలుగు అంతస్తుల్లో ఉంది. రమేశ్ వృత్తిరీత్యా కెమికల్స్‌తో కూడిన ఆయిల్స్ విక్రయిస్తుంటాడు. అపార్టుమెంట్ వెనుకాలే అతడి నివాసం ఉంది. ముందున్న తన అపార్టుమెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌ను కెమికల్స్ డ్రమ్‌ల గోడౌన్‌గా ఉపయోగించుకుంటున్నాడు. ఇక్కడి నుంచే తన కెమికల్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక పక్కన కెమికల్ డబ్బాలు నిల్వ చేశాడు. మరోపక్క ఆ అపార్టుమెంట్‌లో ఉన్న ఎనిమిది ఫ్లాట్లకు సంబంధించిన కుటుంబాలు తమ వాహనాలను పార్కింగ్ చేస్తారు.

### ఈ కెమికల్స్‌కు మండే స్వభావం..

రమేశ్ సెల్లార్‌లో నిల్వ చేసిన కెమికల్స్‌కు మండే స్వభావం ఉంది. నిల్వచేసిన వాటిలో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన రసాయనాలు, ప్లాస్టిక్, ఫైబర్ షీట్లు ఉన్నాయి. ప్రమాదకరమైన ఈ రసాయనాల నిల్వ విషయంలో రమేశ్ ఎలాంటి జాగ్రత్తలు పాటించ లేదు. గోడౌన్‌ను అక్కడి నుంచి తరలించాలంటూ స్థానికులు, కిరాయి దారులు కూడా అనేక సార్లు యజమాని రమేశ్‌ను కోరారు. నా ఇల్లు.. నా ఇష్టం.. అన్నట్లు రమేశ్ వ్యవహరించడమే ఈ ప్రమాదానికి కరణమని స్థానికులు చెబుతున్నారు. ఇంత ప్రమాదకరమైన రసాయాలు నిల్వ ఉంచినా.. సంబంధిత శాఖలు గుర్తించక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యజమాని నిర్లక్ష్యం వల్లే తొమ్మిది మంది మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని, గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ చేసిన ఒక కారుతో పాటు దాదాపు 12 బైక్‌లు ఖాళీపోయాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టంతో పాటు ఆస్తినష్టం కూడా జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

### భయానక వాతావరణం..

బజార్‌ఘాట్‌లోని రసాయనాల గోడౌన్‌లో చెలరేగిన మంటలతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో అంటుకున్న మంటలు కొద్ది సేపటిలోనే .. మొదటి అంతస్తు నుంచి పై అంతస్తులకు వ్యాపించాయి. ప్రమాదస్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. మరోవైపు జీహెచ్ఎంసీ– డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలు చేపట్టాయి. అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డితో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు నారాయణరావు, సుధాకర్‌రావు, హరినాథ్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, మధుసూదన్‌రావు తదితర అధికారులు పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేశారు.

### ప్రమాద కారణాలపై భిన్నవాదనలు

పటాకుల వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే, షార్ట్ సర్క్యూట్‌తో పాటు, సెల్లార్‌లో ఉన్న ఏదైనా పాత వాహనం స్టార్ట్ చేసే సమయంలో వచ్చిన స్పార్క్.. కెమికల్స్‌కు అంటుకొని కూడా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నదన్న వాదన కూడా వినిపిస్తున్నది. పెట్రోలియంతో కూడిన రసాయనాలు ఉండటం వల్లే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నదని అధికారులు తెలిపారు. మంటలు వ్యాపించిన సమయంలో వెలువడే పొగలో కార్బన్ మోనాక్సైడ్ ఉంటుందని, ఈ పొగను పీల్చుకున్న వారు ఊపిరాడక వెంటనే అపస్మారక స్థితిలోకి వెళుతారని చెప్పారు. ఈ ప్రమాదంలో కూడా రసాయనాలతో కూడిన పదార్థాల పొగలు అలుముకున్నాయి. ఈ పొగతో వచ్చిన కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు ఇతర హానికరమైన వాయువులు మనుషుల ప్రాణాలను హరించి వేశాయన్నారు.



### నా బైక్ కాలిపోయింది : వాచ్‌మన్ కిశోర్

నేను స్విగ్గీలో పనిచేస్తూ ఈ భవనం పక్కనే ఉన్న ఇంటికి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాను. నా బైక్‌ను బాలాజీ అపార్టుమెంట్ ముందు పార్కు చేశాను. ఈ అగ్నిప్రమాదంలో బైక్ పూర్తిగా ఖాళీపోయింది. భవనంలో చెలరేగిన మంటలతో భయపడ్డాం. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి పొగలు వచ్చిన విషయాన్ని గుర్తించాం. ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు. ఇప్పుడు తాను స్విగ్గీలో ఎలా పని చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

### తీవ్ర స్థాయిలో మంటలు : స్థానిక మహిళ

దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి వరకు వేడుకల్లో ఉన్నాం. సోమవారం ఉదయం కొంత ఆలస్యంగా నిద్రనుంచి మేల్కొన్నాం. భవనంలో మంటలంటుకున్నాయని తెలియగానే అందరం అక్కడికి చేరుకున్నాం. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. అప్పటికే మంటలు తీవ్ర స్థాయిలో చెలరేగడంతో పాటు నాలుగు అంతస్తులకు వ్యాపించాయి. ఆ భవనంలో ఉంటున్న కుటుంబాలు అరుస్తూ.. పెద్ద పెద్దగా కేకలు వేశారు. చాలా బాధ వేసింది. నివాసాల మధ్య రసాయనాల గోడౌన్‌లను ఏర్పాటు చేయవద్దన్నారు. ఈ ఘటనతోనైనా అధికారులు ఆలోచించాలి.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి... ఈ ఘటన తమను కలిచివేసింది.. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు..

సుల్తాన్‌బజార్: ఈ అగ్ని ప్రమాదంలో 9 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మరణించారు. ఈ భవనం మూడో అంతస్తులోని ఇద్దరు మృతి చెందారు. తొమ్మిది మందిలో ఐదుగురు నిద్రలోనే చనిపోగా.. మరో నలుగురు మాత్రం ఎటూ వెళ్లలేని స్థితిలో మరణించారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మొదటి అంతస్తులో ఉన్న నలుగురిని, రెండో అంతస్తులో ఏడుగురిని కాపాడారు. మూడో అంతస్తులో ఉన్న తల్హా అనే 19 ఏళ్ల వ్యక్తి బచావో.. బచావో అంటూ అరిచాడు. అప్పటికే కాలిన గాయాలతో ఉండటంతో ఆ యువకుడిని కిందికి దింపి చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

### బంధువుల ఇంటికి వచ్చిన...

బంధువుల ఇంటికి వచ్చిన బీడీఎస్ డాక్టర్ తహూరా ఫర్హీన్ (38) తన ఇద్దరు పిల్లలు తూబా, తరూబ మృత్యువాతకు గురయ్యారు. అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబంలో ఉన్న వారితో పాటు బంధువులుగా వచ్చిన వారు కూడా మరణించడంతో అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేసింది.

# ఏమరు పాటుతో భారీ నష్టం

అబిడ్స్, సుల్తాన్‌బజార్, నవంబర్ 13: నాంపల్లి బజార్‌ఘాట్ ప్రాంతంలో చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదానికి కారణాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ సందర్శించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

మొదట కారులో మంటలు లేచాయని, ఆ మంటలు విద్యుత్ వైర్లకు అంటుకోవడంతో వచ్చిన నిప్పు రవ్వలు భవనంలో పడి రసాయనాలు, డీజిల్ డ్రమ్ములకు అంటుకోవడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానాలు వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామంటున్నారు. ఇదిలా ఉండగా.. ఈ ప్రమాదంతో సీసీ కెమెరాలు, వాటి వైర్లు కూడా కాలిపోయాయి.

### ఏమరు పాటుతో...

ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో పొగలు వ్యాపించగా.. అగ్నిమాపక శాఖకు సకాలంలో సమాచారం అందకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగి తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. తొలుత పొగను గమనించిన స్థానికులు పటాకుల పొగగా భావించారు. దీంతో ప్రమాదాన్ని గుర్తించలేకపోయాయని తెలిపారు.

### రసాయనాలతో.. ఇబ్బంది పడ్డ అధికారులు

అగ్నిప్రమాద ఘటనలో చోటు చేసుకున్న పరిణామాలతో స్థానిక ప్రజలు ఒక పక్క భయాందోళనలకు గురికావడమే కాకుండా ఇబ్బందులకు గురయ్యారు. ఒక పక్క మంటలు ఆర్పుతుండగా.. మరోపక్క కెమికల్ డ్రమ్ముల నుంచి రసాయనాలు బయటకు వచ్చాయి. దీంతో రోడ్డు బయట రసాయనాలు పారాయి. దీంతో అగ్నిమాపక, పోలీసులు, మీడియా, స్థానికులు, ఘటనా స్థలికి వచ్చిన రాజకీయ నాయకులు అక్కడ అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది. చాలా మంది ఆ కెమికల్స్ లోనుంచి నడవడంతో వారి బట్టలు, బూట్లు, చెప్పులు పాడైపోయాయి. కెమికల్స్ ప్రభావానికి చాలా మంది ఇబ్బంది పడ్డారు. పోలీసులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు.

### కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నాయకుల బాహాబాహీ

బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నాంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతున్న సమయంలో కొందరు ఎంఐఎం నాయకులు అక్కడికి చేరుకొని అగ్ని ప్రమాదాన్ని రాజకీయం చేయడమేంటని ఫిరోజ్‌ఖాన్‌ను అడ్డుకొని నిలదీశారు. దీంతో ఇరు పార్టీల మధ్య వివాదం నెలకొంది. సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని.. ఇరు వర్గాల వారిని అక్కడి నుంచి పంపించివేశారు. ఫిరోజ్‌ఖాన్, ఎంఐఎం నాయకులను వేర్వేరు మార్గాల్లో పంపించేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఓ దశలో పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. ఉదయం నుంచి సహాయక చర్యల్లో పాల్గొన్నామన్నారు. అంతా అయిపోయిన తర్వాత ఫిరోజ్‌ఖాన్ వచ్చి రాజకీయం చేశాడని తెలిపారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఎం వెంకటేశ్వర్లు, నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అభిలాష్ నేతృత్వంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ప్రమాద స్థలాన్ని సందర్శించిన పలువురు నాయకులు

అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని పలు పార్టీల నాయకులు సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతా రావు, నాంపల్లి ఎంఐఎం పార్టీ అభ్యర్థి మాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సభ్యులు చాడ వెంకటరెడ్డి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఈటీ నర్సింహా తదితరులు సందర్శించి.. ప్రమాదంపై అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు